ఎంఈ, ఎంటెక్ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 6: ఓయూ పరిధిలోని ఎంఈ, ఎంటెక్ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల ఎంఈ, ఎంటెక్ (ఏఐసీటీఈ) మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను రెండు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈనెల 12వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 14వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లామా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ కోర్సు నోటిఫికేషన్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 6: ఓయూ పరిధిలోని పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లామా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ కోర్సులో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ.పాండురంగారెడ్డి తెలిపారు. నగరంలోని పలు ప్రముఖ ఆస్పత్రుల సహకారంతో ఫిజిక్స్ విభాగం అందిస్తున్న ఈ కోర్సులో చేరేందుకు ఫిజిక్స్, న్యూక్లియర్ ఫిజిక్స్‌లో కనీసం 60శాతం మార్కులతో పీజీ పూర్తి చేసి ఉండాలని చెప్పారు. ఎంట్రన్స్ ద్వారా ప్రవేశాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల 11వ తేదీ నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు స్వీకరించనున్నట్టు చెప్పారు. రూ.500 అపరాధ రుసుముతో 10వ తేదీ వరకు స్వీకరిస్తామని అన్నారు. ప్రవేశ పరీక్షను వచ్చే నెల 14న నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు www.ouadmissions.com, www.osmania.ac.in వెబ్‌సైట్‌లలో చూసుకోవచ్చని సూచించారు.

సమగ్ర కుటుంబ సర్వే షురూ..

- అధికారులతో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ సమావేశం
- టీఆర్టీ క్వార్టర్స్‌లో సర్వే ప్రారంభించిన పజ్జన్న
- పలు ప్రాంతాల్లో సమగ్ర సర్వేలో పాల్గొన్న ఎమ్మెల్యేలు


టీఆర్టీ క్వార్టర్స్‌లో సర్వే ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు

సీతాఫల్‌మండిలోని క్యాంప్ ఆఫీస్‌లో సర్వే నిర్వహణపై అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, నవంబర్ 6: ప్రభుత్వం తాజాగా చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వే వల్ల ప్రజలకు మేలు చేకురితేనే మంచిదని, ప్రజల్లో ఉన్న అపోహలను ప్రభుత్వం నివృత్తి చేయాల్సి ఉందని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ళ పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రియను ఎమ్మెల్యే బుధవారం సీతాఫల్‌మండిలోని టీఆర్టీ క్వార్టర్స్‌లో లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సర్వే నిర్వహణ తీరు తెన్నులపై జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు నేతృత్వంలోని అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రజలకు ఉపకరించే కార్యక్రమాలను చేపట్టాల్సి ఉందని స్పష్టం చేశారు. సర్వే బృందాలు ప్రతి కుటుంబాన్ని సందర్శించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా టీఆర్టీ క్వార్టర్స్‌లోని వివిధ నివాసాలను పద్మారావుగౌడ్, కార్పొరేటర్లు, అధికారులు సందర్శించి పౌరులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు హేమ, సునీత, కంది శైలజ, ప్రసన్నలక్ష్మి, అధికారులు ధనశ్రీ, నాయకులు కరాటే రాజు, కంది నారాయణ, గరికపాటి చంద్రశేఖర్, ఆలకుంట హరి, బెజ్జంకి రాజేశ్, అశ్విన్, పాక సాయి, శైలేందర్ పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేట్‌లో..

బన్సీలాల్‌పేట్: సర్వేలో భాగంగా సమగ్ర కుటుంబ సర్వే బుధవారం బన్సీలాల్‌పేట్‌లో మొదలైంది. డివిజన్ మొత్తాన్ని 101 ఎన్యూమరేటర్ బ్లాకులుగా విభజించి, ప్రతి 150 నుంచి 175 కుటుంబాలకు ఒక ప్రభుత్వ ఉద్యోగిని ఎన్యూమరేటర్‌గా నియమించామని బేగంపేట్ సర్కిల్ ఏఎంసీ, వార్డు నోడల్ అధికారి ఎ.కిరణ్‌రెడ్డి తెలిపారు. ప్రతి పది మందికి ఒక సూపర్‌వైజర్ ఉంటారన్నారు. బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కె.హేమలత, బీఆర్ఎస్ నాయకులు కె.లక్ష్మిపతి. రాజేంద్రప్రసాద్, ప్రాపర్టీ ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్, బిల్ కలెక్టర్ సురేశ్, అంగన్‌వాడీ టీచర్ ధనలక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

టీఆర్టీ గ్రౌండ్స్ వద్ద..

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో టీఆర్టీ గ్రౌండ్స్ వద్ద ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్రకుటుంబ సర్వేను సమగ్రంగా వివరాలను సేకరించాలని అన్నారు. సర్వేలో ప్రజలు అధికారులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంసీ ఖాదర్ మోహియుద్దీన్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రాకేశ్ కుమార్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముఠా నరేశ్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, రాజ్‌మోహన్, శ్రీకాంత్, పున్న సత్యనారాయణ, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, పాశం రవి, హంగీర్, వంశీ, కుమారస్వామి, జీహెచ్ఎంసీ ఏఈ మురళి పాల్గొన్నారు. గాంధీనగర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ పావని తన ఇంటి నుంచి కార్యక్రమాన్ని ప్రారంభించారు. డీఎంసీ ఖాదర్ మోహియుద్దీన్, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, టాక్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో డిప్యూటీ మేయర్

ఉస్మానియా యూనివర్సిటీ: తార్నాక డివిజన్‌లో నిర్వహించిన సర్వేలో నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి బుధవారం పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ సర్వే ద్వారా ప్రజల ఆర్థిక, సామాజిక, విద్య, వైద్య, వృత్తి రంగాల్లో సమాచారం సేకరిస్తారని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సుభాష్, ఏఎంసీ హేమలత, శానిటేషన్ డీఈ వెంకటేశ్, డీపీవో శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో

కంటోన్మెంట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, రాజకీయ కుల సర్వే (సమగ్ర కుటుంబ సర్వే)ను బుధవారం కంటోన్మెంట్ ఆరోవార్డు సీతారంపూర్‌లో ఎమ్మెల్యే శ్రీగణేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ డిప్యూటీ సీఈఓ పల్లవి, అర్డీవో సాయికుమార్, హెల్త్ సూపరిండెంట్ దేవేందర్, తహసీల్దార్ అశోక్‌కుమార్, సీనియర్ నాయకులు అజయ్, శ్రీకాంత్, గౌతమ్, తరుణ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను ప్రారంభిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

సర్వే చేస్తున్న వారికి వివరాలు చెబుతున్న డిప్యూటీ మేయర్

బన్సీలాల్‌పేట్‌లో సర్వేను పరిశీలిస్తున్న కార్పొరేటర్ హేమలత, నోడల్ అధికారి కిరణ్‌రెడ్డి

ప్రజల మనిషి వట్టికోట అళ్వారుస్వామి

వట్టికోట అళ్వారుస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు

ముషీరాబాద్, నవంబర్ 6: జీవితాన్ని సమాజ శ్రేయస్సుకు అంకితం చేసిన ప్రజల మనిషి వట్టికోట అళ్వారుస్వామి అని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీ విశ్వేశ్వర రావు అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా బుధవారం రచయిత, ఉద్యకారుడు వట్టికోట అళ్వారుస్వామి సంస్మరణ జరిగింది. ఈ కార్యక్రమంలో జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని అళ్వారుస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదిరికం నుంచి ఎన్నో బాధలను భరించి తెలంగాణ సాహితీ కిరణంగా నిలిచిన వట్టికోట నేటి తరాలకు ఆదర్శప్రాయులన్నారు. ఆయన రచించిన, ప్రజల మనిషి, నిజాం కాలంలో ప్రజల అవస్థలకు దర్పణంగా నిలిచిందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రఘుశ్రీ, చిక్కా రామదాసు, గుండవరపు గీతాదేవి తదితరులు పాల్గొన్నారు.

కాగిత రహిత కార్యకలాపాలు ప్రోత్సహించాలి

టీజీపీసీబీ నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థినులు

అమీర్‌పేట్, నవంబర్ 6: ప్రపంచవ్యాప్తంగా ధ్వంసమవుతున్న అటవీ సంపదలో 35 శాతం చెట్ల నరికివేత కాగిత ఉత్పత్తి కోసమేనని సనత్‌నగర్‌లోని హిందూ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రీమా సర్కారీ శ్రీవాస్తవ పేర్కొన్నారు. సాధ్యమైనంత వరకు కార్యాలయాల కార్యకలాపాలకు కాగితాల వినియోగాన్ని తగ్గించేందుకు డిజిటైజేషన్, ఇ-సిగ్నిచర్స్, సమర్థవంతమైన రీసైక్లింగ్ విధానాలను అవలంభించాల్సి అవసరాన్ని వివరించారు. ప్రపంచ కాగితం దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో సనత్‌నగర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా కాగిత రహిత భవిష్యత్తు, కాగితం తయారీ వల్ల పర్యావరణంపై ప్రభావం, కార్యాలయాల నిర్వహణలో కాగితాలపై ఆధారపడడం వంటి అంశాలపై జరిగిన క్విజ్ పోటీల్లో 70 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. టీజీపీసీబీ ప్రాజెక్ట్ అధికారి బి.నాగేశ్వర్‌రావుతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రీమా మాట్లాడుతూ కార్యాలయ ఉద్యోగి సంవత్సరానికి సగటున 1000 కాగితాలను వాడుతున్నట్టు అంచనా ఉందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో కాగితాల కోసం ధ్వంసమవుతున్న అటవీ సంపదను పరిరక్షించుకునేందుకు వీలుగా కాగిత రహిత కార్యకలాపాల నిర్వహణకు తమ వంతు బాధ్యతలు నిర్వర్తించాల్సిన సమయమిదని, ఇందుకోసం ఆధునిక పద్ధతుల్లో అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ విధానాలను అందిపుచ్చుకోవాలన్నారు. క్విజ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థినులకు టీజీపీసీబీ ప్రశంసా పత్రాలు అందజేసింది.

సాంకేతిక రంగంలో ఎంసీఈఎంఈ కీలకపాత్ర

బొల్లారం, నవంబర్ 6: సాంకేతిక విద్యా రంగంలో మిలటరీ కాలేజీ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీరింగ్ (ఎంసీఈఎంఈ)కీలక పాత్ర పోషిస్తుందని ఎంసీఈఎంఈ లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వర్ష్నే అన్నారు. బుధవారం తిరుమలగిరిలో ఎంసీఈఎంఈ అడ్మినిస్ట్రేషన్ (అనుదేశ్)భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత సైన్యం యొక్క ప్రధాన శిక్షణ సంస్థగా ఎంసీఈఎంఈ లోతైన మూలాలు, స్పష్టమైన దృష్టి భవిష్యత్తును నిర్దేశించే దిశగా ఆవతరిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్మీ అధికారులు, ఎంసీఈఎంఈ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యక్షంగా విన్నప్పుడే సంపూర్ణ అవగాహన

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 6: బోధనా రంగంలో ఎంతో సాంకేతికత వచ్చినప్పటికీ, తరగతి గదిలో అధ్యాపకుడు బోధించే విషయాన్ని ప్రత్యక్షంగా విన్నప్పుడే సంపూర్ణ అవగాహన ఏర్పడుతుందని ఓయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎం.కుమార్ అన్నారు. తెలుగు శాఖ నుంచి వీసీలుగా ఎంపికైన ప్రొఫెసర్లు సూర్యధనుంజయ, నిత్యానందరావుకు అభినందన సభను బుధవారం నిర్వహించారు. తెలుగు విభాగం హెడ్ ప్రొఫెసర్ కమలాకరశర్మ అధ్యక్షతన ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వర్సిటీలో వన్‌సైడ్ టీచింగ్ కాకుండా తరగతి గదిలో విద్యార్థుల భాగస్వామ్యాన్ని పెంచాలన్నారు. అనంతరం తెలుగు విభాగంలో సుదీర్ఘకాలం ప్రొఫెసర్లుగా బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ సూర్యాధనుంజయ, ప్రొఫెసర్ నిత్యానందరావును ఘనంగా సన్మానించారు. పలువురు మాట్లాడుతూ తెలుగు విభాగం వివిధ వర్సిటీలకు వీసీలను తయారు చేసే కర్మాగారమని అన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సయీదా తలత్ సుల్తానా, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బీనవేణి రామ్‌షెఫర్డ్, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు, ప్రొఫెసర్లు కాశిం, ఏలె విజయలక్ష్మి, రఘు పాల్గొన్నారు.

ఓయూ రిజిస్ట్రార్, ఓఎస్డీలకు శుభాకాంక్షలు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 6: ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్‌నాయక్‌ను ఓయూజేఏసీ నాయకులు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జేఏసీ చైర్మన్ కొత్తపల్లి తిరుపతి ఆధ్వర్యంలో వారికి పుష్పగుచ్ఛం అందజేసి, ఘనంగా సన్మానించారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ విద్యార్థులు, ఉద్యోగులు, అధ్యాపకుల సమస్యలు వెనువెంటనే పరిష్కరించేలా చూడాలని కోరారు. వర్సిటీ ప్రతిష్టను పెంపొందించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు పాపారావు, అరుణ్, శరత్, శ్రీనివాస్, రవి, సంతోష్, మహేశ్, ప్రవీణ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

యూజీసీ పేస్కేల్ అమలు చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 6: రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రతతో కూడిన యూజీసీ పేస్కేల్స్ అమలు చేయాలని కాంట్రాక్ట్ అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లో పనిచేస్తున్న తమకు యూజీసీ పేస్కేల్ అమలు చేయాలని కోరుతూ ఎనిమిది నెలలుగా వివిధ రూపాల్లో ఉద్యమిస్తున్నామని గుర్తు చేశారు. అనేక ఏళ్లుగా అన్ని అర్హతలు ఉండి, వర్సిటీలనే నమ్ముకొని బోధన, పరిశోధనలపై ఉన్న ఆసక్తితో వర్సిటీల్లో పనిచేస్తున్నామని చెప్పారు. యూజీసీ నిబంధనల ప్రకారం స్కేల్ అమలు చేయాలని కోరారు. తమకు స్కేల్స్ లేకపోవడంతో వర్సిటీలో పరిశోధనలు పూర్తిగా కుంటుపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. యూజీసీ, ఏఐసీటీఈ, ఎన్‌సీఆర్‌టీ ఫండింగ్ ఏజెన్సీల నుంచి మేజర్ రీసర్చ్ ప్రాజెక్టులు, మైనర్ రీసర్చ్ ప్రాజెక్టులకు వీరిని అనుమతించడం వల్ల పరిశోధనలు జరుగుతాయని, తద్వారా విశ్వవిద్యాలయ ఖ్యాతి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. యూజీసీ స్కేల్స్ అమలు చేయకపోవడం వలన తమను ప్రాజెక్టులకు అనుమతించబడట్లేదని తెలిపారు. పరిశోధక విద్యార్థులకు మార్గదర్శనం చేసేందుకు సైతం యూజీసీ పే స్కేల్స్ ఉండాల్సిందేనని చెప్పారు. తమ డిమాండ్‌పై వేం నరేందర్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చొప్పదండి సత్యం, అధ్యాపక సంఘం నాయకులు సీమర్ల విజయేందర్‌రెడ్డి, ఉపేందర్, రేష్మారెడ్డి, వేల్పుల కుమార్, వెంకటేశ్, రామలింగం, రమేశ్, హరీశ్, కిరణ్‌కుమార్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, నవంబర్ 6: టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కేవీ ఆజామాబాద్, శంకర్ మఠ్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతు కారణంగా గురువారం(నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆజామాబాద్ డివిజన్ ఏడీఈ జి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 1గంటల వరకు ఆజామాబాద్ ఇండస్ట్రీయల్ ఏరియా ఫీడర్ పరిధిలోని అచ్చుతారెడ్డి మార్గ్, సీపీఎం ఆఫీసు, రాంనగర్ గుండు, విద్యానగర్ పోస్టాఫీసు, అజామాబాద్ ఇండస్ట్రీయల్ ఏరియా పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శంకర్ మంత్ ఫీడర్ పరిధిలోని పద్మకాలనీ, శంకర్‌మఠ్, మతృశ్రీ స్కూల్, నల్లకుంట, అమర్ మెటర్నరీ ఆసుపత్రి, కురుణ మెడికల్ హాల్ పరిసరాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

చిక్కడపల్లి, నవంబర్ 6: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుకోవాలి ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విజయ్‌భాస్కర్ అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో బుధవారం సీపీఆర్‌పై సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రథమ చికిత్స పట్ల అవగాహ కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. సీపీఆర్‌లో కార్డియాక్ అరెస్ట్ అయినప్పుడు ప్రథమ చికిత్స గురించి వివరించారు. ప్రిన్సిపాల్, డైరెక్టర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

9న పార్థివ లింగాభిషేకం

అమీర్‌పేట్: సనాతన ధర్మం పట్ల చిన్న పిల్లల్లో అవగాహన పెరిగేలా సనత్‌నగర్‌లోని సనాతన ధర్మ బాల సంస్కరణ సమితి ఆధ్వర్యంలో 108 మంది చిన్న పిల్లలతో పార్థివలింగాభిషేకం, అర్చన చేస్తున్నట్టు సమితి ప్రతినిధులు తెలిపారు. ఈనెల 9న మోడల్‌కాలనీ కమ్యూనిటీ హాల్ 'సంస్కృతి'లో సాయంత్రం శివకేశవులకు పార్థివలింగాభిషేకం, అర్చన 7 నుంచి 15 ఏండ్ల 108 మంది చిన్నారులచే జరుగుతుందన్నారు. పూజ సామగ్రి సమితి ప్రతినిధులు సమకూరుస్తారని అన్నారు. కలియుగంలో పార్థివ లింగార్చన ప్రతిఒకరు చేసి తీరాల్సిన విధి అని చెప్పారు. ఆసక్తిగల చిన్నారులు 87907 64019 నంబరులో వాట్సాప్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

బస్తీల సమగ్రాభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే ముఠా గోపాల్


రాంనగర్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, నవంబర్ 6: అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్‌లో శ్రీనివాస టెక్స్‌టైల్స్ సమీపంలో రూ.7లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను బుధవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బస్తీల్లో మౌలిక సదుపాలు కల్పించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్, రోడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించడంతోపాటు అభివృద్ధి పనులను అధిక నిధులు కేటాయించినట్టు చెప్పారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో ఆరేళ్లుగా పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు. ప్రధానమైన డ్రైనేజీ సమస్యల పరిష్కారం కోసం కోట్లాది నిధులు ఖర్చు చేసి పనులు చేపడుతున్నామని, దశలవారీగా చాలా బస్తీలు, కాలనీల డ్రైనేజీ సమస్యలను పరిష్కరించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ సన్నీ, బీఆర్ఎస్ నాయకులు ముఠా జయసింహ, బి.శ్రీనివాస్‌రెడ్డి, మహ్మద్ ఖదీర్, బొట్టు శ్రీనివాస్, ముచ్చకుర్తి ప్రభాకర్, సత్యనారాయణ, లక్ష్మిపతి, మున్నూ తదితరులు పాల్గొన్నారు.

చిలకలగూడ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 6: హెల్మెట్ వినియోగించకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనదారుల్లో అవగాహన కల్పించేందుకు చిలకలగూడ ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఆలుగడ్డ బావి ప్రాంతంలో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సీహెచ్ శ్రీనివాసులు హెల్మెట్ లేని వారికి కౌన్సెలింగ్ చేసి, నూతన హెల్మెట్‌ను వారితో కొనుగోలు చేయించి, ధరింపజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవలి కాలంలో హెల్మెట్ లేకపోవడం చేత వాహనదారులు మరణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ద్విచక్రవాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు.

నేడు జాతీయ సెమినార్

చిక్కడపల్లి, నవంబర్ 6: బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం గ్రేట్ అక్టోబర్ రివల్యూషన్ వార్షికోత్స వాన్ని పురస్కరించుకుని జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్టు సీసీసీ కన్వీనర్లు కామ్రేడ్ మంగత్‌రామ్ పాస్లా, ఎం.అశోక్ ఓంకార్ తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లోలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. నేడు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న జాతీయ సెమినార్‌కు పలువురు వామపక్ష నేతలు హాజరై తమ విలువైన అభిప్రాయలు పంచుకుంటారని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి కమ్యూనిస్టు నాయకులు మహిపాల్ సత్తి, పర్గతసింగ్, తజిందర్‌సింగ్, గోదగోని రవి, కాటం నాగభూషణం, అనుభవదాస్‌శాస్త్రి, మహేందర్, చంద్రమోహన్ ప్రసాద్, కుమార్, కృష్ణామాల్, వనం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 6: రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఐఏఎస్ వెంకటేశ్వర్లును విద్యార్థి నాయకుడు కొమ్మనబోయిన సైదులుయాదవ్ ఆధ్వర్యంలో విద్యార్థి నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కమిషన్ సెక్రెటరీ బడుగు సైదులును సైతం కలిశారు.

అన్నకూట్ కార్యక్రమం

బేగంపేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని జనరల్ బజార్‌లో లక్ష్మినారాయణ దేవస్థానంలో బుధవారం అన్నకూట్ నిర్వహించారు. కార్యక్రమంలో అనువంశిక ధర్మకర్తలు గుమిడెల్లి శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు. అనంతరం నైవేద్యాలను స్వామివారికి సమర్పించి భక్తులకు వితరణ చేశారు. కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

వాయూ ఫుడ్ డెలివరీ యాప్ ప్రారంభం

మారేడ్‌పల్లి: సికింద్రాబాద్ సప్తగిరి హోటల్‌లో వాయూ పేరుతో ఫుడ్ డెలివరీ యాప్ బుధవారం ప్రారంభమైంది. యాప్‌ను ఓఎన్‌డీసీ ఫుడ్, బేవరేజెస్ లీడ్ రిషీగుప్తా, వర్టికల్ హెడ్ రోషిత్‌షా ఆవిష్కరించారు. దేశంలో మొట్ట మొదటి జీరో కమిషన్ ఫుడ్ డెలివరీ యాప్ ఇదేనని, యాప్ వ్యవస్థాపకులు మందర్ లాండే, అనిరుధ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరస్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

మారేడ్‌పల్లి, నవంబర్ 6: సైబర్ నేరస్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ అనుమల శ్రీనివాస్, సికింద్రాబాద్ జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సాయిఈశ్వర్‌గౌడ్ అన్నారు. ఇటీవల జరుగుతున్న సైబర్ నేరాలపై వృద్ధుల ను అప్రమత్తం చేయాలని ఉన్నతాధికారుల సూచనల మేరకు బుధవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అవగాహన నిర్వహించారు. రైల్వే వృద్ధ ప్రయాణికులకు సైబర్ మోసాల